క్లుప్తంగా

వైభవంగా కనక మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం

సఖినేటిపల్లి: మోరిలో మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థంల్లో భాగంగా శుక్రవారం కనక మహాలక్ష్మమ్మ (దుర్గ) హంస వాహనంపై గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో పూజలు అందుకున్న దుర్గ అమ్మవారిని హంస వాహనంలో సిద్ధం చేసిన అశ్వవాహనంపై కొలువుదీర్చారు. మోరి, మోరిపోడు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు సాగింది. ఊరేగింపులో ఇంటింటా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా గురువారం రాత్రి జరిగిన జాతరలో అమ్మవార్లకు వంశ పారంపర్యంగా సేవలందిస్తున్న పూజారులతో పాటు వారి కుటుంబాల్లోని మహిళలు, చిన్నారులు సైతం ఘటాలను శిరస్సులపై ధరించి అమ్మవార్లపై భక్తిని చాటి చెప్పారు.

వైభవంగా గణపతి శాంతి కల్యాణం

కొత్తపేట: స్థానిక కళానగర్ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ 23వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు విజయకుమార్ పర్యవేక్షణలో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి హోమం, పెన్నులతో స్వామివారి అభిషేకం కార్యక్రమాలు అనంతరం రాత్రి స్థానిక ఆలయ పోషక సభ్యులు సయ్యపరాజు శ్రీధర్‌రాజు కుటుంబ సభ్యులతో స్వామివారి శాంతి కల్యాణం కనులవైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా యాజ్ఞవల్క్య ఆశ్రమ వార్షికోత్సవం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో యాజ్ఞవల్క్య ఆశ్రమం 61వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మహర్షి యాజ్ఞవల్క్య నామమున ఆశ్రమాన్ని రామతీర్థ స్వామిజీ అప్పట్లో స్థాపించారని, నాటి నుంచి నేటి వరకూ ఆశ్రమం ద్వారా భక్తులకు జ్ఞాన ప్రసాదాలు అందిస్తోందని భక్త సమాజం వెల్లడించింది. వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమంలో గాయత్రీ జ్ఞాన యజ్ఞం తణుకు ఆర్యసమాజం శిష్యబృందం సభ్యులు మణి, అమ్మాజీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ మేరకు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.20 వేల చోరీ

ఆత్రేయపురం: మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన రంకిరెడ్డి భాగ్యశ్రీ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.20 వేలు చోరీ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. గత నెల 5న బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మీ అకౌంట్ సరిచేయాలని ఓటీపీ చెప్పమనగా ఆమె చెప్పింది. దీంతో ఆమె అకౌంట్‌లో రూ.20 వేలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్‌గా మంగతాయారు


మంగతాయారు

అంబాజీపేట: మండల తహసీల్దార్‌గా టి.మంగతాయారు ఉద్యోగ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. రాజమహేంద్రవరం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కలసి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌కి ఘన సత్కారం

ఆలమూరు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐపీ శెట్టికి శుక్రవారం సత్కారం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు తహసీల్దార్ శెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్లాంటేషన్ బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు దొండపాటి చంటి, చింతపల్లి నాగేశ్వరరావు, కడలి ఉపేంద్ర, గొడితి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దీక్షిత్‌కు ప్రతిభా పురస్కారం


గెద్దం దీక్షిత్

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ జూనియర్ కాలేజీ విద్యార్థి గెద్దం దీక్షిత్‌కు టెక్ మహేంద్ర ఆధ్వర్యాన సాక్షమ్ స్కాలర్‌షిప్ కింద రూ.10,000 శుక్రవారం మంజూరు చేశారు. ఈ మేరకు ఒక కార్యక్రమంలో దీక్షిత్‌ను కళాశాల కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణ మూర్తి అభినందించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే స్కాలర్‌షిప్ నిమిత్తం కృషి చేసిన తెలుగు అధ్యాపకుడు ఎం.గంగాధర్‌రావు, ప్రిన్సిపాల్ ఎంవీవీ బాబులును కరస్పాండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ భరోసా

- కౌలు రైతులకు సహాయం
- ఆనందంలో రైతులు


రైతులు సాగు చేస్తున్న వరి పంట

మామిడికుదురు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో అండగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధి మూడో విడత ఆర్థిక సహాయాన్ని అందుకున్న రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కడం ద్వారా ఈ సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశారు. ఈ రెండు పథకాల ద్వారా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 2,948 మంది రైతులకు రూ.17.50 కోట్లు మేర ఆర్థిక సహాయం అందించారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఏటా మూడు దఫాలుగా రూ.13,500 సహాయం అందిస్తోంది. దీనిలో కేంద్రం తన వాటాగా రూ.ఆరు వేలు అందిస్తుండగా, మిగిలిన రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా అందిస్తూ రైతులకు చేదోడుగా నిలుస్తోంది. అంతే కాకుండా కౌలు రైతులకు కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే ఏటా రూ.13,500 సహాయం అందిస్తోంది. మొదటి, రెండో విడతగా గత ఏడాది మే, అక్టోబరు నెలల్లో ఈ సహాయాన్ని రైతుల ఖాతాలకు జమ చేయగా మూడో విడత సహాయాన్ని గత నెల 28వ తేదీన జమ చేశారు.

ప్రయోజనం పొందిందిలా..

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతులు 1,323 మందికి రూ.1.06 కోట్లు సహాయం అందించారు. 1,525 మంది కౌలు రైతులకు రూ.76.15 లక్షలు రైతు భరోసా అందించారు. మూడు నియోజకవర్గాల్లో మొత్తం 2,948 మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు భరోసా, పీఎం కిసాన్ నిధి ద్వారా రూ.17.50 కోట్ల సహాయం అందింది. రెండు ప్రభుత్వాలు అందిస్తున్న సహాయం పంటల సాగులో పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, పంట సాగు చేయగా వచ్చిన ఆదాయం వడ్డీ చెల్లించేందుకే సరిపోయేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా హాయిగా పంట సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

మూడెకరాల్లో కౌలు చేస్తున్నా



నగరం గ్రామంలో మూడెకరాలు కౌలుకు తీసుకుని పంట పండిస్తున్నా. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా నాకు రూ.13,500 సహాయం అందింది. గతంలో ఎన్నడూ ఈ విధంగా కౌలు రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. ఈ సహాయం పంట పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో మాదిరిగా అప్పులు చేయాల్సిన పని లేకుండా స్వేచ్ఛగా వ్యవసాయం చేస్తున్నాను. నా లాంటి చాలా మంది కౌలు రైతులకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోంది.

– గుబ్బల వెంకటరమణయ్య, కౌలు రైతు, నగరం

జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది



నేను దాదాపు 20 ఏళ్ల నుంచి కౌలు వ్యవసాయం చేస్తున్నాను. గత ప్రభుత్వాలు ఎన్నడూ కౌలు రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. జగన్ సీఎం అయిన తర్వాతే కౌలు రైతులకు సహాయం అందిస్తున్నారు. నేను రెండకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నా. నాకు ఇన్సూరెన్స్ సొమ్ముతో పాటు రూ.13,500 సహాయం బ్యాంకు ఖాతాకు జమైంది. రైతులకు జగన్ ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది.

– విప్పర్తి శ్రీనివాస్, కౌలు రైతు, పాశర్లపూడి

ఇన్‌పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ వస్తోంది



నేను సుమారు నాలుగెకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నా. నాకు ఇన్సూరెన్స్ రూపేణా రెండు విడతలుగా రూ.మూడు వేలు వచ్చింది. దీంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీగా మరో ఆరు వేలు, రైతు భరోసా రూపేణా రూ.13,500 సహాయం అందింది. మన రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న రీతిలో దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా రైతులను ఆదుకోవడం లేదు. కౌలు రైతులను ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ సర్కారుకే దక్కుతుంది.

– కొల్లాబత్తుల మధువాసన్, కౌలు రైతు, మొగలికుదురు

సంక్షేమానికి ప్రజలు అండగా నిలవాలి


మొగలికుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. మొగలికుదురు, పెదపట్నం, నగరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' అవగాహన కార్యక్రమాలకు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పునకు నాంది పలికాయన్నారు. అభివృద్ధిలో ఏ మాత్రం రాజీ పడకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతున్నామన్నారు. వీటితో పాటు సంక్షేమంలో కూడా ఎక్కడా వెనక్కు తగ్గకుండా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలను తీసుకువస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందుకు వెళ్తున్నామన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివరించి వైఎస్సార్ సీపీకి అండగా నిలిచే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. జేసీఎ కన్వీనర్ జక్కంపూడి వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, సర్పంచ్ కడి అరుణకుమారి, ఎంపీటీసీలు కొప్పిశెట్టి దుర్గాపార్వతీదేవి, నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, తాడి శేఖర్, కడలి శ్రీనివాస్, కొమ్ముల చిన్న, సజ్జాద్ హుస్సేన్, అన్వర్ తాహిర్ హుస్సేన్, పిచ్చుక చిన్న, గెద్దం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఆటలొద్దు


అంబాజీపేటలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని వారి భవిష్యత్‌తో ఆటలాడుకోవద్దని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హెచ్చరించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించిన రన్నింగ్‌లో 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు నెలరోజులు కూడా లేవని ఇటువంటి సమయంలో వారికి క్రీడలు అవసరమా అన్నారు. క్రీడలు ఉంటే సాయంత్రం సమయంలో నిర్వహించాలే తప్ప మండుటెండలో కాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, జేసీఎ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, తోలేటి బంగారునాయుడు, కోట సత్తిబాబు, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంఈఓ జె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు వినియోగించుకోవాలి

కొత్తపేట: రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎరువులను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి.పద్మలత సూచించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత రబీ వరి యాజమాన్య పద్ధతులు, ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళిక అంశాలను వివరించారు. యాంత్రీకరణ వ్యవసాయ విధానాల్లో భాగంగా డ్రోన్ ప్రయోజనం గురించి వివరించారు. ఆసక్తి గల రైతులు ముందుకు రావాలన్నారు. పీఎం కేవైసీ ఇంకా చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలన్నారు. గత ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో హమాలీ చార్జీలు ఇంకా పడని రైతులకు త్వరలోనే పడతాయన్నారు. ప్రస్తుత దాళ్వా ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన వాహనాలు, సంచుల విషయంలో ఇబ్బందులు పడకుండా ముందుగానే అందుబాటులో ఉంచాలని పలువురు రైతులు కోరారు. సమావేశంలో వీఏఏలు కార్తిక్, లలిత, నీలిమ, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నాబార్డు నుంచి రూ. 9.46 లక్షల మంజూరు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలోని ఏటిగట్టును చేరుకుని ఉన్న పంట కాల్వపై శిథిల స్థితికి చేరిన శ్లాబ్ కల్వర్టు పునర్నిర్మాణానికి నాబార్డు ద్వారా రూ.9,46,759 నిధులు మంజూరు చేశారు. నిధుల మంజూరుకు సంబంధించిన ఆర్డర్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్థానిక మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజుకు శుక్రవారం అందజేశారు. వైనతేయ గోదావరి నదీతీరంలోని దేవాలయాలకు, టూరిజం స్పాట్‌కు, శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో శ్లాబ్ కల్వర్టు పాడైపోయిందని, దాని పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, పాశర్లపూడి గ్రామ పంచాయతీ నాబార్డుకు గతంలో నివేదించింది. దీనిపై స్పందించిన నాబార్డు ఏజీఎం, డీడీఎం వై.సోమునాయుడు నిధులు మంజూరు చేశారని మాజీ సర్పంచ్ నాగరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధరం తెలిపారు. నిధులు మంజూరు చేసిన నాబార్డు సంస్థకు, జిల్లా కలెక్టర్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

కూలీకి రూ.11 వేల సాయం

గత నెలలో పాము కాటుకు గురైన పాశర్లపూడి చెందిన ఉపాధి హామీ పథకం కూలీ పి.లక్ష్మికి ఉపాధి కూలీలు, స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు రూ.11 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సహాయాన్ని మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఉపాధి కూలీ లక్ష్మికి అందించారు.

పారదర్శకంగా సర్వే రాళ్ల ఏర్పాటు

అంబాజీపేట: జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే పనులను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించి సర్వే రాళ్లను ఏర్పాటు చేశామని తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. ముక్కామల, పసుపల్లి సచివాలయాల్లో జగనన్న భూ రక్ష పథకంపై ఆర్ఐ ఎండీ ఇబ్రహీం అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మంగతాయారు మాట్లాడుతూ ఇప్పటికే ముక్కామలలో సర్వే రాళ్లు వచ్చాయన్నారు. వీటిని రెవెన్యూ సిబ్బంది నిబంధనల ప్రకారం సూచించిన చోట ఏర్పాటు చేస్తారన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూములను రీ సర్వే చేసి పారదర్శకంగా రికార్డులను రూపొందించారన్నారు. సరిహద్దుల్లో రాళ్లను పాతుకునే సమయంలో రైతులు సహకరించాలన్నారు. సమావేశంలో వీఆర్వో డి.పార్థసారథి, రైతులు దేవరపల్లి చినబాలయోగి, బచ్చు రామపండు, వక్కలంక నరసింహమూర్తి, దువ్వూరి బాలకృష్ణ, నముడూరి బాబీ, సూరికుచ్చి సారధి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం


రావులపాలెంలో వేంకటేశ్వరస్వామి దదదకల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పి.గన్నవరం/మామిడికుదురు/రావులపాలెం/ఆత్రేయపురం/సఖినేటిపల్లి: పి.గన్నవరం మండలం జి.పెదపూడిలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా జరిగింది. మామిడికుదురులో కొలువుదీరిన పార్వతీ రామలింగేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల పదో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు నిర్వహించారు. రావులపాలెంలోని అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి వార్షిక నవాహ్నిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆత్రేయపురం మండలంలోని పులిదిండి, నార్కెడిమిల్లి వేణుగోపాలస్వామి, రాజవరం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, పలు ఆలయాల్లో కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేదిపాలెంలో ఉన్న వేణుగోపాలస్వామివారి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

బాలుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


బాలుడి తల్లికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని ముమ్మిడివరప్పాడుకు చెందిన తాతపూడి గౌతమ్ ఒంటిపై వేడి నీరు పడటంతో తల్లిదండ్రులు రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు.

కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే


అమలాపురంలో కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాను, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కలిశారు. ఈ మేరకు కలెక్టర్‌తో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. అలాగే వీటికి నిధుల మంజూరు గురించి చర్చించారు. అలాగే జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రను తన చాంబర్‌లో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలసి, జేసీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వెంట నాయకులు జాన శంకరరావు, ఉప్పు సోమరాజు, కొల్లాబత్తుల అశోక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఏడేళ్ల విద్యార్థి

సఖినేటిపల్లి: మోరిపోడు ఒక ప్రైవేటు స్కూల్‌లో ఏడేళ్ల విద్యార్థి తాడి రోహన్ మానవత్వాన్ని చాటుకున్నాడు. ఇటీవల పాఠశాలకు అంధుడు వచ్చి ఆర్థికసాయం కోసం అభ్యర్థించారు. దీంతో సదరు విద్యార్థి ఇరుగు, పొరుగు వాళ్ల వద్ద నుంచి రూ.1100 సేకరించి, పాఠశాల బోధన సిబ్బందికి ఇచ్చాడు. ఈ మేరకు శుక్రవారం వారు పై మొత్తాన్ని సదరు అంధుడికి అందజేశారు.

ఎమ్మెల్యేను కలసిన ఎమ్మెల్సీ


ఎమ్మెల్యే రాపాకను మర్యాద పూర్వకంగా కలసిన ఇజ్రాయిల్

మలికిపురం: మండలంలోని కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును ఇటీవల ఎమ్మెల్సీగా నామినేట్ అడిన బొమ్మి ఇజ్రాయిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఇజ్రాయిల్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సామూహిక అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో చిన్నారులకు శుక్రవారం సామూహిక అక్షరభ్యాసాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యంలో సుమారుగా 20 మంది చిన్నారులకు తమ తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అలాగే అన్నప్రాశన, నామకరణలు వంటివి నిర్వహించారు.

ఎమ్మెల్సీకి పలువురి అభినందనలు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన బొమ్మి ఇజ్రాయిల్‌ను మండలానికి చెందిన పలువురు నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అల్లవరం మండలంలోని గోడిలంకలోని ఆయన నివాసానికి మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావుతో పాటు పలువురు మాదిగ సంఘ నాయకులు ఉండ్రాసపు సుందరం విజయం, అయినవిల్లి అర్జున్, యు.యోహాన్ వెళ్లారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎంపికైన ఇజ్రాయిల్‌ను పూలమాలలు వేసి అభినందించారు.

కోనసీమ అభివృద్ధి ప్రదాత బాలయోగి

అంబాజీపేట/అయినవిల్లి/సఖినేటిపల్లి: కోనసీమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరస్థాయిగా నిలిచిపోయారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు డొక్కా నాథ్ బాబు, నామన రాంబాబు అన్నారు. బాలయోగి వర్ధంతిని అంబాజీపేట, అయినవిల్లి, సఖినేటిపల్లి మండలాల్లో పలుచోట్ల టీడీపీ నాయకులు నిర్వహించారు. అంబాజీపేటలో వక్కలంక బుల్లియ్య సమకూర్చిన దుస్తులు, టవల్స్‌ను నిరుపేదలకు అందజేశారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన

రాజోలు: వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌సీ డీడీఏ జ్యోతిర్మయి అన్నారు. శుక్రవారం చింతలపల్లి ఆర్బీకే వద్ద మండల ఏవో మనోహర్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో డీడీఏ జ్యోతిర్మయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మార్చి నెలాఖరులోగా కోతకు వచ్చే వరి పొలాల్లో పచ్చి రొట్ట సాగు చేయాలన్నారు. చింతలపల్లి గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు గెద్దం సత్యనారాయణ, పమ్మి ఆనందరావు, వీఏఓ బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దారి ఇవ్వపోతే కిరోసిన్ పోసుకుంటాం

అయినవిల్లి: దారి ఇవ్వకపోతే కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంటామంటూ వీరవల్లిపాలేనికి చెందిన పలువురు శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి ఓ దాత స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే ఆ స్థలానికి చేరుకుని ఉన్న గ్రామానికి చెందిన కోటిపల్లి తాతాజీ, సుబ్బన్న, సుబ్బారావు, సీతారామయ్య, అర్జునరావు, రామదాసు ఇలా మొత్తం 40 మంది తమ ఇళ్లకు వెళ్లడానికి 12 అడుగుల దారి ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. దారి ఇవ్వకపోతే కిరోసిన్ పోసుకుని అంటించుకుంటామంటూ ఆందోళన చేశారు. గ్రామస్తులు, స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు.

పరిశోధన కేంద్ర సిబ్బందికి బీమా పథకం

అంబాజీపేట: కొబ్బరి అభివృద్ధి బోర్డు సౌజన్యంతో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర సిబ్బందికి కీర, సురక్ష బీమా పథకం కల్పించినట్లు కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. పరిశోధన కేంద్రంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది ఒక్కొక్కరికి రూ.5 లక్షలు కవరేజ్ ఉన్న బీమా పత్రాలను కేంద్రం అధిపతి శ్రీనివాసులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, ఎ.కిరిటీ, వి.అనూష, జి.కోటేశ్వరరావు, సీహెచ్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

అంబాజీపేట: దివ్యాంగ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించడంతో పాటు వారిని ప్రేమతో సాకాలని ఎంఈఓ ఎంపీ కనకదుర్గ, జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి బీర హనుమంతరావు అన్నారు. మాచవరంలో ఉన్న భవిత కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు మెరుగైన ఫిజియోథెరపీ అందించాలన్నారు. ఫిజియోథెరపీకి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ఎస్‌కే బేగం, సీఆర్పీ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది షాపుల లీజులకు వేలం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని షాపుల లీజు, వివిధ లైసెన్సు హక్కుల నిమిత్తం శుక్రవారం ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో వీటిని నిర్వహించామన్నారు. ఒక సంవత్సర కాలపరిమితికి గాను ఫొటోలు తీసుకునే హక్కు, కల్యాణ మండపాలు వేసుకునే హక్కు, కూల్‌డ్రింక్ షాపు నిర్వహణ నిమిత్తం, పూజా సామగ్రి షాపు నిర్వహణ, కొబ్బరిచెట్ల ఫలసాయం తీసుకునే హక్కు నిమిత్తం లీజులు కన్ఫార్మ్ చేసినట్టు ఆయన అన్నారు. వీటితో పాటు మరో ఆరింటికి కూడా టెండరు ఖరారు చేశామన్నారు. ఎంపీటీసీ బైర నాగరాజు పాల్గొన్నారు.